క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు, టీషర్ట్‌ల వితరణ



విద్యార్థులకు పుస్తకాలు, టీషర్ట్‌లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

కె.కోటపాడు : దాతలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులంతా చదువుల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అన్నారు. పాచిలవానిపాలెం పాఠశాలలో గల 28 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన బి.భాస్కర్ టీషర్ట్‌లు, పాచిల రామారావు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు సమకూర్చారు. వీటిని వైస్ ఎంపీపీ సూర్యనారాయణ అందించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు గండి సత్యనారాయణ, సిరపరపు రమణారావు, పాచిల దేముడుబాబు, రొంగలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత



దాత శశిభూషణరావు అందించిన విద్యా సామగ్రితో విద్యార్థులు

దేవరాపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు సత్య సాయి సేవా సమితి సభ్యుడు రావాడ శశిభూషణరావు విద్యా సామగ్రి వితరణ చేశారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అవసరమయ్యే జామెట్రీ బ్యాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు సమకూర్చారు. ఈ సామగ్రిని మండలంలోని సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. దాత రావాడ శశిభూషణరావుకు మండల విద్యాశాఖ అధికారి-1 డి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి. ఉషారాణి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీలో పాము కలకలం



యువకుల చేతిలో హతమైన పాము

గొలుగొండ : గొలుగొండ పీహెచ్‌సీలో బుధవారం రాత్రి నాగజెర్రి కలకలం రేపింది. పీహెచ్‌సీలోకి పాము రావడంతో సిబ్బంది ఆందోళన చెందారు. ఐదు అడుగులున్న నాగజెర్రి నేరుగా స్టాఫ్ రూమ్‌లోకి వెళ్లి దాక్కుంది. విషయం తెలిసిన వెంటనే సిబ్బంది స్థానిక యువకులకు సమాచారం ఇచ్చారు. దీంతో నలుగురు యువకులు వచ్చి పామును హతమార్చడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

సీనియర్ సిటిజన్ రామ్మూర్తికి సత్కారం

దేవరాపల్లి : దేవరాపల్లి గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దేవరాపల్లికి చెందిన సీనియర్ సిటిజన్ గొల్లు రామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సీనియర్ సిటిజన్లను గౌరవించుకోవడం మన బాధ్యత అని రాజేశ్వరి అన్నారు. స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీటీసీ సోమిరెడ్డి సత్యవతి, స్థానిక గ్రంథాలయ అధికారి ఒ.శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు కొల్లి ఈశ్వరరావు, కాటపల్లి సృజన, సోమిరెడ్డి పేరునాయుడు, సబ్బవరపు మాలిబాబు పాల్గొన్నారు.

జోరుగా కింతలి వంతెన నిర్మాణ పనులు



వంతెన పనులు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల : కింతలి వల్లాపురంలోని గొరిగెడ్డపై రూ. 30 లక్షలతో జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేయడానికి ప్రణాళికలు పనులు ముమ్మరం చేశారు. బుధవారం ఈ పనులను వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ రాంబాయి రాంబాబు పరిశీలించారు. త్వరితగతిన పనులు జరుగుతుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 7997958337, 7075709854, 7997958336

సాగు పనుల్లో.. అన్నదాతలు బిజీ

- రిజర్వాయర్ నీరు విడుదలతో ముమ్మరంగా దమ్ము పనులు
- ట్రాక్టర్లు, నాగలి సెట్లతో జోరుగా వ్యవసాయ పనులు



జెడ్.కొత్తపట్నం ఆయకట్టు భూముల్లో వరి నారు తీస్తున్న రైతులు



గంపవానిపాలెంలో దమ్ము పనులు చేస్తున్న రైతులు

రావికమతం : మండలంలో ప్రధాన సాగునీటి వనరు అయిన కల్యాణపులోవ రిజర్వాయర్ నీరు విడుదలతో ఆయకట్టు భూముల్లో ముమ్మరంగా దమ్ముపనులు, వరినాట్ల పనులు జరుగుతున్నాయి. ఈ నెల 14న రిజర్వాయర్ నీటిని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చేతుల మీదుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. 460 అడుగుల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్‌లో ప్రస్తుతం 452 అడుగుల నీరుంది. వరి పంటకు సమగ్రంగా నీరందాలంటే కాలువలో రోజుకు 30 క్యూసెక్కుల నీటిని 50 రోజుల వరకూ విడుదల చేయాలి. అయితే ప్రస్తుతానికి నీరు 452 అడుగులే ఉండటం.. పైగా ఎండలు విపరీతంగా కాస్తుండటంతో ఎక్కడి భూముల్లో నీరు అక్కడే ఇంకిపోతోంది. రిజర్వాయర్ సమీప భూములైన చీమలపాడు, గంపవానిపాలెం, జెడ్.కొత్తపట్నం భూములకు పూర్తిగా నీరు చేరడంతో ఆయా భూముల్లో రైతులు ముమ్మర దమ్ము పనుల్లో బిజీగా ఉన్నారు. ఒక వైపు ట్రాక్టర్లు, మరోవైపు నాగలి సెట్లతో దమ్ములు పడుతూనే, దమ్ము పూర్తయిన మడుల్లో నారతీత పనులు చేపట్టారు. కొన్ని మడుల్లో వడివడిగా వరినాట్లు వేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని పైరుల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది.

దశాబ్దాల రహదారి కష్టాలకు మోక్షం



బండారు వారి కల్లాల వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి : దేవరాపల్లి శివారు ప్రాంతాల ప్రజల దశాబ్దాల రహదారి కష్టాలకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మోక్షం లభిస్తుందని స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. బండారు వారి కల్లాలు, గేదెల వారి కల్లాలకు వెళ్లే మార్గంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. బండారు వారి కల్లాలకు రూ. 12 లక్షలతో 300 మీటర్ల మేర, గేదెల వారి కల్లాలకు రూ. 19 లక్షలతో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ రాజేశ్వరీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను సురక్షితంగా ఇళ్లకు తీసుకెళ్లే విధంగా కల్లాలకు సైతం సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, దీవి శంకరరావు, కొల్లి ఈశ్వరరావు, ఎడ్ల బంగారయ్య, కాటపల్లి సృజన, మాజీ ఎంపీటీసీ సోమిరెడ్డి సత్యవతి పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు



గొలుగొండలో దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్న పంచాయతీ, వైద్య సిబ్బంది

గొలుగొండ : గొలుగొండ పంచాయతీలో దోమల నివారణకు పంచాయతీ, వైద్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు. దీంట్లో భాగంగా బుధవారం పంచాయతీ సిబ్బంది గ్రామాల్లోని వీధి కాలువుల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. బుధవారం గొలుగొండలో పిచికారీ నిర్వహించగా గురువారం శివారు గ్రామాలైన శ్రీరాంపురం, కొత్త జోగుంపేట, 80 కాలనీ, ఎస్సీ కాలనీలో దోమల మందు పిచికారీ చేస్తామని సర్పంచ్ కసిపల్లి బుజ్జి తెలిపారు.

పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు



ఎ.కోడూరు పశు విజ్ఞాన బడిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీ బైరాగి

కె.కోటపాడు : బ్యాంక్‌ల ద్వారా పాడి పశువులు పెంచే రైతులు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పొందవచ్చని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి అన్నారు. ఎ.కోడూరు ఆర్బీకేలో బుధవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆర్బీకేలలో ఉన్న పశువైద్య సహాయకులను సంప్రదించి బ్యాంకుల ద్వారా క్రెడిట్ కార్డులు తీసుకోవాలని తెలిపారు. పశువుల కొనుగోలు, పెంచేందుకు రైతులు రూ. 25 వేల నుండి రూ.లక్ష వరకూ రుణం పొందవచ్చన్నారు. ఏడాదికి ఒక ఈత వలన పాల ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఉండదని, దూడ కూడా పుడుతుందని తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడపెయ్యిలు పుడతాయన్నారు. రెండు డోసుల వీర్యానికి రైతులు కేవలం రూ.500 మాత్రమే చెల్లించాలన్నారు. ఆడపెయ్యి జన్మించని పక్షంలో రైతులు వీర్యానికి చెల్లించిన నగదును వాపస్ చేస్తారన్నారు. పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నేడు

దేవరాపల్లి : మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సహా ఎంపీటీసీలు, సర్పంచ్‌లంతా హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో రామారావు, ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్, చార్టెడ్ అకౌంటెంట్ మడిపల్లి రామారావు అన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని బుధవారం 200 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరి దేవస్థాన సంఘం ఇస్తున్న స్కాలర్‌షిప్‌లకు తన మామ గ్రంధి హనుమంతరావు పేరిట రూ.50 వేలు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. అంతకుముందు ఆయన కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు రామారావును ఘనంగా సత్కరించారు. ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యానికి డీఎంకు వినతి



ఆర్టీసీ డీఎం ధీరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు

నర్సీపట్నం: పాపయ్యపాలేనికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మాకవరపాలెం మండలం ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ నాయకులు బుధవారం ఆర్టీసీ డీఎం ధీరజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతానికి బస్సు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డీఎంకు వివరించారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని డీఎం హామీ ఇచ్చారు. డీఎంను కలిసిన వారులో ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు, పార్టీ నాయకులు రుత్తల రాజుబాబు, లోవరాజు, శ్రీను ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా



చోడవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ద్వారకానగర్ కాలనీ వాసులు

చోడవరం : తమ ప్రాంతంలో అలుముకున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ద్వారకానగర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. చోడవరం తహసీల్దార్ కార్యాలయం, పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ద్వారకానగర్ కాలనీ వాసులు ధర్నా చేశారు. వీరికి దళిత విముక్తి సంఘం మద్దతు పలికింది. చోడవరం పంచాయతీ పరిధిలో 11,12 వార్డుల్లో పట్టణ శివారు ప్రాంతంగా ఉన్న ద్వారకానగర్‌లో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఆ ప్రాంతానికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయలు కల్పించలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కాల్వలు, అంతర్గత రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వెంటనే ఈ సమస్యలు అధికారులు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, ద్వారకానగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజీవ్, హుస్సేన్, బోడయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎం. కోడూరులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం. కోడూరులో వివిధ అభివృద్ధి పనులను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు భూమి పూజ చేసి ప్రారంభించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పాడేరు ఆర్ అండ్ బి రహదారి నుంచి హైస్కూలుకెళ్లే రహదారి పనులు ప్రారంభించారు. కోట్లాది రుపాయల వ్యయంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ సంజీవరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పోతిన జగదీశ్, గంగిరెడ్ల లింగన్న పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు



మునగపాకలో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మునగపాక : ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. మునగపాకలోని ములబంద గోడీ ప్రాంతంలో వరి నారుమళ్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ-పంట నమోదు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఏ విస్తీర్ణంలో ఎంత మేర ఎటువంటి పంటలు వేస్తున్నారనే వివరాలను స్థానిక అధికారులు అప్‌లోడ్ చేస్తారన్నారు. ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. ఈ-పంట నమోదు చేసుకోకుంటే ప్రభుత్వం నుంచి సాయం అందదని తెలిపారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఉడుపులు చేసే ముందు నారు చివర్లను తుంచడం ద్వారా ఎదుగుదల కనిపిస్తుందని, అలాగే ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయితీపై రైతులకు ఎరువులు,విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్. జ్యోత్స్నకుమారి, వీఏఏలు సింధూజ, పవన్‌కుమార్, రైతు సంఘ అధ్యక్షులు మహేష్, రైతులు బొడ్డేడ రామునాయుడు, దాడి శివ, సూరిశెట్టి రామునాయుడు, బొడ్డేడ శివ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నగదుకు ఈకేవైసీ చేయించుకోవాలి

మాడుగుల : పీఎం కిసాన్ 14 వ విడత నగదు రైతుల ఖాతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. మండలంలో 16 వేల మంది రైతులకు పీఎం కిసాన్ రావలసి ఉండగా ఇంతవరకు 15 వేల 24 మంది రైతులకే పీఎం కిసాన్ బ్యాంకు ఖాతాలో జమ అయిందన్నారు. మిగిలిన 976 మంది ఈకేవైసీ చేయించుకుంటే వారి బ్యాంకు ఖాతాల్లో కూడా నగదు జమ అవుతుందన్నారు.

సూక్ష్మ రుణ పత్రాల పంపిణీ

కశింకోట: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో జీవనోపాధి మెరుగుపరచుకోవాలని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం తాళ్లపాలెం, నూతలగుంటపాలెం శివారు అచ్యుతాపురం స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ రుణ ప్రణాళికలో మంజూరైన రూ.10 లక్షల రుణ పత్రాలను సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అందించారు. సమాఖ్య సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీను, రామకృష్ణ, వీవోఏలు నాగేష్, రూప తదితరులు పాల్గొన్నారు.

18న శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు గ్రామంలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ తొలి శ్రావణ శుక్రవారం, రెండవ శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సర్వే

అనకాపల్లిటౌన్: ఓటర్ల జాబితాలో ఎక్కడైనా మార్పులు, చేర్పులు ఉంటే తక్షణమే బీఎల్వోలకు తెలియజేయాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ప్రజా సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఓటరు సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీత్రుగెడ్డ గ్రామానికి పాఠశాల మంజూరు



పాఠశాల మంజూరు అయిన పీత్రుగెడ్డ గ్రామంలో చిన్నారులతో తల్లిదండ్రులు

రోలుగుంట : అర్ల గిరిజన పంచాయతీ శివారు గ్రామాలైన లోసింగి, పీత్రుగెడ్డ తదితర గ్రామాల్లో గల చిన్నారుల విద్యావసరాలను ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు సంబంధించిన నివేదికను ఎంఈవోలు ఆ శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో ఎన్ఆర్ఎస్‌టీసీ (నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్) 2023-24 విద్యా సంవత్సరానికి గాను మంజూరు అయింది. ఈ పాఠశాలలో తాత్కాలికంగా పని చేసేందుకు ఇంటర్, డీఎడ్, డిగ్రీ, బీఈడీ చదివిన స్థానిక గిరిజన అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 19లోపు మండల విద్యా శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని ఎంఈవో-1 పి.జానుప్రసాద్, ఎంఈవో-2 జగ్గారావు కోరారు. మరిన్ని వివరాలకు 6303996517, 9912560441 నంబర్లలో సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామానికి పాఠశాల మంజూరు కావడంపై ఈ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీబీపట్నం హైస్కూలుకు మైక్ సెట్ వితరణ



ఉపాధ్యాయ సిబ్బందికి మైక్ సెట్ అందజేస్తున్న కన్నడ చలన చిత్ర హీరో సిద్ధు

రోలుగుంట : బీబీ పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలకు కన్నడ చలన చిత్ర హీరో గొందు సిద్ధు రూ. 20 వేల విలువ గల మెగా మైక్ సెట్‌ను బుధవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, దీనిలో భాగంగానే ఈ హైస్కూల్‌కు మైగా సౌండ్ మైకు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. తమ పాఠశాలకు మెగా సౌండ్ మైకు అందజేసిన సిద్ధూకు పాఠశాల హెచ్ఎం నట్టి అప్పారావు, ఇంగ్లిష్ టీచర్ బి.తమ్మునాయుడు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించాలి



ఎం. అలమండ ఆర్‌బీకేలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌వో రజనీకుమారి, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి : పంట కోత ప్రయోగాలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల సహాయ గణాంక అధికారి (ఏఎస్‌వో) ఆర్. రజనీకుమారి అన్నారు. మండలంలోని ఎం. అలమండ రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ ఆధ్వర్యంలో బుధవారం పంట కోత ప్రయోగాలపై అన్ని గ్రామాల అగ్రికల్చర్ అసిస్టెంట్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో రైతులకు సంబంధించిన సర్వే నంబర్ల వారీగా ఏ పంటలు వేశారో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పంట కోత దశలో పంట దిగుబడి ఎంత మేర వచ్చిందో పరిశీలించాలన్నారు. పంట దిగుబడి ఆధారంగానే పంటల బీమా వర్తిస్తుందని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

రావికమతం : ఈ ఏడాది మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని రావికమతంహైస్కూల్ పీడీ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. అండర్ 11 విద్యార్థులు 3-5 తరగతి చదువుతుండాలని, జనవరి 1, 2013 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్ 14 విద్యార్థులు 6-10 వతరగతి చదువుతుండాలని, జనవరి1, 2020 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్ 17 విద్యార్థులు 6-12 చదువుతుండాలని, జనవరి1, 2002 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్ 19 విద్యార్థులు 6-12 చదువుతుండాలని, జనవరి 1, 2005 తర్వాత జన్మించి ఉండాలన్నారు.

రైతుల శ్రమదానంతో పెద్దేరు కాలువ రంధ్రాల పూడ్చివేత



శ్రమదానం చేస్తున్న పలు గ్రామాల రైతులు

రావికమతం : పెద్దేరు కుడి ప్రధాన కాలువలో పలువురు రైతులు అక్రమంగా రంధ్రాలు పెట్టడం వలన నీరు వృథాగా పోతూ శివారు భూములకు రావడం లేదు. దీంతో చినపాచిల, కవగుంట, పొంగలిపాక గ్రామాల నాయకులు దాసరి వరహాలు, కోమటి శంకర్రావు, నాయన సత్తిబాబు, భాస్కరరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది రైతులు బుధవారం శ్రమదానం చేశారు. ఏళ్ల తరబడి కాలువ అడుగుభాగంలో ఉన్న రంధ్రాలను పూర్తిగా మూసి వేశారు. ఆయా గ్రామాల నాయకులు, రైతులు బుధవారం శ్రమించి అవురువాడ ఫుట్‌పాత్ బ్రిడ్జి మొదలుకుని అయిదు కిలోమీటర్ల మేర ఉన్న రంధ్రాలను పూడ్చివేశారు. ఇప్పటికైనా అధికారులు కాలువను నిత్యం పర్యవేక్షించి రంధ్రాలు ఏర్పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఆర్మీ మహిళా జవాన్ కంఠపురెడ్డి మానస పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ సేవలను పలువురు వక్తలు ప్రస్తుతించారు. ఉప్పు సత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలో ఆయన చేపట్టిన ఉద్యమాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు చిరస్మరణీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గొంతిన శ్రీనివాసరావు, కర్రి దుర్గినాయుడు, పాల సంఘం అధ్యక్షుడు గూడెపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com